ప్రజాశక్తి
మంగళవారం 17 అక్టోబరు 2023
5
శ్రీకాకుళం



రేపు ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ (ప్రెస్ అకాడమీ) చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈనెల 18వ తేదీన జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకాకుళం నగరంలోని ఆర్అండ్‌బి అతిథిగృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు అరసవల్లి సూర్యనారాయణస్వామి, 3.20 గంటలకు శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథస్వామి ఆలయాలను సందర్శించనున్నారు. 4.30 గంటలకు శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు ఆర్అండ్‌బి అతిథిగృహానికి చేరుకుని రాత్రి బస చేస్తారు. 19న ఉదయం ఎనిమిది గంటలకు బయలుదేరి పార్వతీపురం వెళ్తారని తెలిపారు.

పేదల భూములు పరాధీనం

- అసైన్డ్ ల్యాండ్‌కు హక్కులు కల్పించేందుకు సాగుతున్న సర్వే
- పెద్దల అధీనంలో అనధికారికంగా అసైన్డ్ భూములు
- జిల్లాలో 2003కు ముందు 38,868.72 ఎకరాల పంపిణీ
- తాజా సర్వేలో పేదల సాగులో 14,852.61 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తింపు

అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో కీలక అంశాలు వెలుగు చూస్తున్నాయి. పేదలకు ఇచ్చిన భూములు పెద్దలపరమైనట్లు తెలుస్తోంది. గతంలో పేదలకు ఇచ్చిన చెరువులు, వాగులు, కాలువ భూములకు హక్కులు ఇవ్వబోమని అధికారులు చెప్తుండడంతో, ఇప్పటికే అనుభవంలో ఉన్న పేదలు తీవ్ర ఆందోళన చెందున్నారు. ఇప్పటివరకు చేపట్టిన సర్వేలో మూడోవంతు మందికీ హక్కులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు జిల్లాలో పేదలకు పంపిణీ చేసిన భూమిలో మూడింట రెండు వంతుల భూమి భూస్వాములు, పెద్దల అధీనంలోకి వెళ్లిపోయినట్లు సర్వే ద్వారా స్పష్టమవుతోంది.





ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు ఎపి అసైన్డ్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్) సవరణ ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం ఈ ఏడాది జూలై 27వ తేదీన తీసుకొచ్చింది. దీని ప్రకారం 2003, జూలై 31వ తేదీకి ముందు కేటాయించిన భూములపై ఆంక్షలు తొలగించి, అసైన్డ్ భూములకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించేందుకు రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టింది. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సాగు అవసరాల కోసం జిల్లాలోని పేదలకు పలు సందర్భాల్లో వేలాది ఎకరాలను పంపిణీ చేశారు. భూమి లభ్యత ఆధారంగా ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకంగా 20 సెంట్ల నుంచి 2.5 ఎకరాల వరకు లబ్ధిదారులకు అందించారు.

ఈ భూములు పొందిన లబ్ధిదారు కుటుంబాలు సాగు చేసి జీవన ప్రమాణాలు బాగుపడాలనే ఉద్దేశంతో ఈ భూముల క్రయ విక్రయాలను నిషేధించింది. చట్టం అమల్లో అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడంతో, అనధికారికంగా పెద్దల చేతుల్లోకి భూమి వెళ్లిపోయింది. జిల్లాలో మూడు వంతుల భూమి మాత్రమే అసైనీలు, వారి వారసుల సాగులో ఉన్నట్లు ఇప్పటివరకు చేపట్టిన సర్వే ద్వారా స్పష్టమవుతోంది. పేదలకు పంపిణీ అయిన భూమిలో 66 శాతం విస్తీర్ణంలోని భూములు నిబంధనలకు విరుద్ధంగా భూస్వాములు, పెద్దల అధీనంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఈ భూముల్లో ఆక్వా చెరువులు తవ్వి రొయ్యలు, చేపలు పెంపకం సాగిస్తున్నట్లు గుర్తించారు.

పేదల సాగులో 14 వేల ఎకరాలే

జిల్లాలో జూలై 31, 2003కు ముందు 38,868.72 ఎకరాలు పంపిణీ అయినట్లు అధికారులు గుర్తించారు. వీటిలో ఇప్పటివరకు 14,852.61 ఎకరాలకు మాత్రమే హక్కులు కల్పించేందుకు అర్హమైనవిగా తేల్చారు. జిల్లాలో మొత్తం 621 గ్రామాలను సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 615 గ్రామాలను సర్వే చేశారు. సర్వే పూర్తి చేసిన తర్వాత నిషిద్ధ జాబితా నుంచి అసైన్డ్ భూములను తప్పించాలని సూచిస్తూ జిల్లా కలెక్టర్ రిజిస్ట్రేషన్ల శాఖకు లేఖ రాయనున్నారు. దాని ఆధారంగా రిజిస్ట్రేషన్ల శాఖ వాటిని డి-నోటిఫై చేయనుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆ భూములకు క్రయ విక్రయాలు చేసుకునేందుకు వీలు పడుతుందని అధికారులు చెప్తున్నారు.

పెద్దల అధీనంలో 24 వేల ఎకరాలు!

అసైన్డ్ భూములకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన సర్వేలో 24,016 ఎకరాలు పెద్దల అధీనంలో ఉన్నట్లు తేలింది. పేదల అవసరమే ఆసరాగా చేసుకుని గ్రామంలోని భూస్వాములు, నాయకులు పేదల నుంచి తక్కువ ధరకు అనధికారికంగా కొనుగోలు చేసి తమ పరం చేసుకున్నారు.

రియల్ ఎస్టేట్లు, రొయ్యలు, చేపల చెరువులు, పలురూపాల్లో వాటిని వినియోగించుకున్నట్లు క్షేత్రస్థాయి సర్వేలో వెలుగుచూస్తున్నాయి. భూములపై నిషేధం ఉన్నప్పుడే వేలాది ఎకరాలు ఇతరుల పరాధీనమైన సందర్భంలో ఇప్పుడు నిషేధం ఎత్తివేయడంతో, ప్రస్తుతం పేదల సాగులో ఉన్న ఆ కాస్త భూమి పెద్దల పరం కానుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

వామపక్ష నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై నగరంలోని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యాన సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అధిక ధరలు, అదనపు భారాలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ భారాలు వేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా విద్యుత్ ఛార్జీల పెంపు, శ్లాబులు మార్చి భారాలు మోపడం, ట్రూఅప్, ఇంధన, సర్‌ఛార్జీలు, కస్టమర్, ఫిక్స్‌డ్, సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ సుంకం పెంపు పేర్లతో రెట్టింపు భారాన్ని ప్రజలపై మోపిందని వివరించారు.

బిల్లులు చెల్లించలేక ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, పరిశ్రమలు మూతపడుతున్నాయని, ఉపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా జమా ఖర్చులపై విచారణ లేకుండానే యూనిట్‌కు అదనంగా 40 పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం దారుణమన్నారు. వడ్డీ పేరుతో మరో రూ.1500 కోట్లు రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు విద్యుత్‌శాఖ చేసిన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే విధిస్తున్న సర్దుబాటు ఛార్జీల భారాలను రద్దు చేయాలని కోరారు.

ప్రజలపై భారాలను మోపే విధానాలను ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశిస్తే, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల పన్ను రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు వేస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వానికి అదానీ, అంబానీ ప్రయోజనాలు తప్ప సామాన్యుల ప్రయోజనాలు పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసి ఆదాయాలు రాబట్టాలని ఆదేశాలు జారీ చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను అమలు చేయకపోతే అప్పులకు అనుమతి ఇచ్చేది లేదని బెదిరిస్తోందన్నారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తూ, ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందని విమర్శించారు. ధర్నాలో వామపక్షాల నాయకులు కె.మోహనరావు, జి.సింహాచలం, పి.తేజేశ్వరరావు, జి.రామకృష్ణ, కె.అప్పారావు, టి.తిరుపతిరావు, గోవర్ధన్, ఎల్.మహేష్, పి.గణేష్, ఎ.షణ్ముఖరావు, సిహెచ్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంల తనిఖీ ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఇవిఎంలను భద్రపరిచే భవనంలో ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,357 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి అవసరమైన ఇవిఎంలను రెండు, మూడు వారాల పాటు రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తిస్థాయిలో పరిశీలన చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రతి యంత్రంలోనూ ఓట్లు వేసి ఏదైనా సాంకేతిక లోపం ఉన్న వాటిని పక్కనపెట్టి, మిగిలిన వాటిని ఆమోదించే ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. బెంగుళూరు నుంచి వచ్చిన బిఇఎల్ సిబ్బంది వెబ్‌కాస్టింగ్, పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య చేపడుతున్నారన్నారు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం వరకు



నిర్వహించే కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై ఇవిఎంల సాంకేతికతపై అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. పరిశీలన సమయంలో కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతించబోమని, గుర్తింపుకార్డులు ఉన్న సిబ్బంది మాత్రమే పనిచేస్తారని తెలిపారు. సిసి కెమెరాల్లో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిపిఒ ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నాయి... సాగునీరు అందించండి

- 'స్పందన'లో రైతుల వినతులు
- వంశధార ఎస్ఇ డోల తిరుమలరావుకు మెమో జారీ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

వంశధార ఎడమ కాలువ ఆయకట్టు కింద నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సాగునీరు అందడం లేదని పాతటెక్కలి, పొల్లాడ, సైనూరు, జగన్నాథపురం, గోవిందపురం, కణితివూరు ప్రాంతాల నుంచి రైతులు వినతులు అందజేశారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. పలు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 229 వినతులు వచ్చాయి. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయదేవి వినతులను స్వీకరించారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, నందిగాం ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి ఆధ్వర్యాన నందిగాం మండల రైతులు వినతిపత్రాలను అందజేశారు. ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వరికి తక్షణమే సాగునీరు అందించాలని కోరారు. నదిలో నీటి నిల్వలు తగ్గాయని వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు చెప్పడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో విఫలమయ్యారని మెమో జారీ చేశారు. పలు పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోగా, వేరే వ్యక్తి ఖాతాలో విద్యాశాఖ అధికారులు జమ చేశారని కాంట్రాక్టరు జగదీష్ ఫిర్యాదు చేశారు. బిల్లుల చెల్లింపులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని సమగ్ర శిక్ష ఎపిసి రోణంకి జయప్రకాష్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్యం క్షీణించిన చంద్రబాబును తక్షణమే ఆస్పత్రిలో చేర్పించి వైద్య చికిత్సలు అందించాలని టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు వినతిపత్రం అందజేశారు. స్పందన వినతులు అందజేయడానికి వచ్చిన వృద్ధునికి విభిన్న ప్రతిభవంతుల శాఖ నుంచి వినికిడి యంత్రాన్ని అందజేశారు.

రీఓపెన్ వినతులపై మరింత శ్రద్ధ

జిల్లాలో రీ ఓపెన్ వినతులు 20 వరకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఆయా అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాంలో ఏడు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్ లక్ష్మీప్రసన్న, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, హౌసింగ్ పీడీ ఎన్.గణపతి పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాగునీరందించడంలో ప్రభుత్వం విఫలం

- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరీష
- జెడ్‌పి కార్యాలయం వద్ద టిడిపి నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



రైతులకు సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష విమర్శించారు. వంశధార ఎడమ కాలువ ద్వారా శివారు ప్రాంత భూములకు సాగునీరందించాలని కోరుతూ పలాస, వజ్రపుకొత్తూరు మండలాల రైతులతో కలిసి జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. వంశధార సాగునీటి కాలువలు నాలుగేళ్లుగా పూడిక పేరుకుపోయి గట్లు బలహీనపడ్డాయన్నారు. దీనికితోడు ఎగువ ప్రాంతంలో సాగునీటి వినియోగంపై నియంత్రణ కరువైందన్నారు. దీనివల్ల నాలుగేళ్లుగా శివారు ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలాస మండలంలో వంశధార కాలువ ప్రారంభమైన టెక్కలిపట్నం పంచాయతీ మోదుగులపుట్టి వద్ద గల వంశధార ప్రధాన ఎడమ కాలువకు సరైన నిర్వహణ లేక సాగునీరు రాకపోవడంతో పంటలు ఎండి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వంశధార సాగునీటిపై ఆధారపడిన సుమారు ఏడు వేల ఎకరాల వంశధార ఆధారిత భూముల రైతులు కరువు కోరల్లో చిక్కుకున్నారని చెప్పారు. పలాస నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తక్షణమే శివారు భూములకు సాగునీరందించాలని రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.మోహనరావు, వసంతస్వామి, పుచ్చ ఈశ్వరరావు, కె.రమణ, శివప్రసాద్, ఎ.షణ్ముఖరావు, రైతులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తులు తగ్గితే ప్రమాదకరం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ శంకరనారాయణ

శ్రీకాకుళం : ఆహార ఉత్పత్తులు తగ్గితే మానవ జీవన ప్రమాణాలకు ప్రమాదకరమని ప్రభుత్వ మహిళా కళాశాల ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఆహార దినోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆహారాన్ని, నీటిని అవసరమైనంత వాడుకోవాలలన్నారు. నీటి ప్రాముఖ్యతను వివరించారు. అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు మాట్లాడుతూ 600 మిలియన్ల మంది ప్రజలు జీవనోపాధి కోసం కనీసం పాక్షికంగానైనా జల, ఆహార వ్యవస్థలపై ఆధారపడి ఉన్నారని చెప్పారు. ఆర్థికశాస్త్ర విభాగాధిపతి టి.ఆదిలక్ష్మి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్తీ లేని ఆహారం ఆరోగ్యానికి రక్ష

మంచి ఆహారం తీసుకొని ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని ఆహార నియంత్రణ భద్రతాధికారి కె.వెంకటరత్నం తెలిపారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారని, ఇంట్లో నాణ్యమైన ఆహారాన్ని తయారు చేసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉంటాయని పేర్కొన్నారు.

నేటి నుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కొత్తమ్మతల్లి ఉత్సవాలు ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు 19వ తేదీతో ముగియనున్నాయి. ప్రతిఏటా ఈ ఉత్సవాలు మహాలయ అమావాస్య తర్వాత వచ్చే గురువారం నాడు ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు జిల్లా, ఉత్తరాంధ్ర ప్రాంతవాసులే కాకుండా తెలంగాణ, ఒడిశా నుంచి యాత్రికులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బోయిన మాధవి కృష్ణారావు, ధర్మకర్తలి మండలి వైస్ చైర్మన్ బి.నాగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ, సర్పంచ్ కాళ్ల సంజీవరావు తదితరుల పర్యవేక్షణలో ఏర్పాట్లను పూర్తి చేశారు. కోటబొమ్మాళి మెయిన్ రోడ్డులో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి రెండు కిలోమీటర్ల పొడవునా కొత్తపేట వరకు విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. లైటింగ్‌తో ఏర్పాటు చేసిన వెంకటేశ్వర స్వామి, కొత్తమ్మ తల్లి భారీ కటౌట్లు చూపరులను ఆకట్టుకుంటోంది. ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జెయింట్ వీల్, శాలంబో, బ్రేక్ డాన్స్, కారు, మోటార్ సైకిల్ విన్యాసాలు ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేశారు. దర్శనాలకు వచ్చే వారికి ఉచిత ప్రసాదం, భోజన ఏర్పాట్లను చేస్తున్నారు. యాత్రికుల సౌకర్యార్థం ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఉత్సవాల సందర్భంగా సంగిడీరాళ్లు, ఈడుపురాయి, ఉలవల బస్తాల పోటీలు మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నారు. పగటి వేషాలు, కోయ నృత్యాలతో పాటు మూడు రాత్రులు పలు పౌరాణిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.





జాతరకు భారీ బందోబస్తు

మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసింది. టెక్కలి సిఐ సూర్య చంద్రమౌళి ఆధ్వర్యాన సుమారు 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. ఎవరైనా ఎటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడినా 9440795835, 08942 238633 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

19 నుంచి నిరవధిక దీక్షలు

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి : యుటిఎఫ్



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

శ్రీకాకుళం : పాత పెన్షన్ సాధనకు యుటిఎఫ్ ఆధ్వర్యాన ఈనెల 19వ తేదీ నుంచి శ్రీకాకుళం నగరంలో నిరవధిక దీక్షలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో వారు మాట్లాడారు. జిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలనే ప్రధాన డిమాండ్లతో ఈ దీక్షలు చేపడుతున్నట్లు చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సిపిఎస్ విధానాన్ని నాటి ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల వెన్నువిరిచారని తెలిపారు. ఆ విధానం రద్దు కోసం నాటి నుంచి నేటివరకు అలుపెరుగని పోరాటాలు చేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని హామీనిచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేడు మాట తప్పి మడమ తిప్పారని విమర్శించారు. సిపిఎస్ కన్నా ఘోరమైన జిపిఎస్ అనే మరో పెను అభద్రతా పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రాణాలైనా అర్పిస్తాం.. పాత పెన్షన్ సాధిస్తాం అనే నినాదంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల వృద్ధాప్య జీవిత భరోసా కోసం యుటిఎఫ్ రాజీ లేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. నిరాహార దీక్షలను విజయవంతం చేయడానికి జిల్లాలోని సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు ప్రతిఒక్కరూ మద్దతుగా నిలబడి పాత పెన్షన్ సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎల్.బాబూరావు, కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

బాధితులకు సత్వర న్యాయం

ఎస్‌పి స్పందనకు 20 అర్జీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చూస్తామని ఎస్‌పి జి.ఆర్.రాధిక భరోసానిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో 20 అర్జీలు అందాయి. వీటిని ఎఎస్‌పి టి.పి.విఠలేశ్వర్‌తో ఫిర్యాదులు వివరాలు పరిశీలించారు. అనంతరం ఎస్‌పి ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ తగాదాలు నాలుగు, పౌర సంబంధాలు ఆరు, పాత ఫిర్యాదులు రెండు, ఇతరత పిర్యాదులు 8 వచ్చాయి. ఫిర్యాదిదారులకు చట్టపరిధిలో పరిష్కరించి సత్వర న్యాయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



కోర్టు ఆవరణలో నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి బాయ్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదుల హాలులో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన జరిగిన సమావేశంలో 20వ తేదీ వరకు కోర్టు విధులకు హాజరు కాకుండా బహిష్కరణ చేపట్టాలని తీర్మానించినట్లు తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఏకపక్షంగా ప్రతి పిటిషన్‌పై రూ.20 వెల్ఫేర్ స్టాంప్ అంటించాలని తీసుకున్న నిర్ణయంపై తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో రూ.20 స్టాంపును రద్దు చేయాలని నినాదాలు చేస్తూ విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పైడి వరాహ నరసింహం, కిల్లి మార్కండేయులు, బొడ్డేపల్లి మోహనరావు, సువ్వారి అనిల్ కుమార్, వాడవలస రాజేశ్వరరావు, దోల రమణ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సాగునీరు అందించాలని వినతి

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి పంచాయతీ గోపీనాథ్‌పురం, ధర్మనీలాపురం గ్రామాలకు చెందిన రైతులకు సాగునీరు అందించాలని రైతులు కోరారు. ఈ మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వంశధార మెయిన్ కెనాల్ నుంచి సాగునీరు చిన్న కాలువల ద్వారా తమ ప్రాంతానికి సాగునీరు అందేదని ఈ క్రమంలో సుమారు 200 ఎకరాలకు సాగునీరు పుష్కలంగా వచ్చేదని తెలిపారు. అయితే మెయిన్ కెనాల్ నుంచి చిన్న కెనాల్‌కు వచ్చే మార్గంలో ఆక్రమణకు గురికావడంతో తమ ప్రాంతానికి సాగునీరు అందడం లేదని అన్నారు. ప్రస్తుత ఎండల తీవ్రత వల్ల సాగునీరు అందక వంట పొలాలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి కాలువలో పూడికతీత, ఆక్రమణలు తొలగించి తమ పొలాలకు సాగునీరు అందించేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు రంగబాబు, కిషోర్, తులసి నాయుడు, సురేష్‌బాబు, పార్వతి ఉన్నారు.

ఆహారాన్ని వృథా చేయొద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆకలితో ఉన్న వారికి ముందు అన్నం పెట్టు, ఆ తర్వాత వేదం చెప్పు అంటారు స్వామి వివేకానంద. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబరు 16న జరుపుకుంటారు. ఈ సందర్భంగా సోమవారం వరల్డ్ ఫుడ్ డే లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యాన రామలక్ష్మణ జంక్షన్‌లో నిర్వహించారు. అక్కడ ఉన్న 50 మంది రిక్షా కార్మికులకు భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ ఆహార కొరత వలన ఎందరో చనిపోతున్నారన్నారు. ఆహారం సరిపోక అనారోగ్యంతో ఉండడం మనం చూస్తున్నాం, వింటున్నామని, ఇటువంటి పరిస్థితి ఎవరికి రాకుండా ఉండాలంటే ఆహారాన్ని వృథా చెయకూడదని, అలాగే మనం చేసుకొనే ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని పేదలకు, అనాథ శరణాలయం, వృద్ధాశ్రమాలకు ఇస్తే బాగుంటుందని, ఇలా అందరూ ఆలోచించి, ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, జోనల్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, సెక్రెటరీ రామ్ గోపాల్, ట్రెజరర్ శిల్లా మణి, లయన్స్ సభ్యులు, అర్బలిస్ట్ కామేష్ తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలను సందర్శించిన గిడుగు కుటుంబ సభ్యులు

కళాశాల సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు కుటుంబ సభ్యులు నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న గిడుగు వారి ఐదవతరం వారసులు గిడుగు సరస్వతి కుటుంబ సమేతంగా కళాశాల తెలుగు విభాగాన్ని సందర్శించారు. కళాశాల ప్రాంగణంలో గిడుగు రామమూర్తి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులతో గిడుగు కుటుంబ అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎంవి సత్యనారాయణ తెలుగు విభాగ తరఫున గిడుగు వారసులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ పివి రమణ, తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఢిల్లీశ్వరరావు, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ శశిభూషణ్, హిందీ అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కోటబొమ్మాళి: మహిళా సంఘాలు బ్యాంకుల నుంచి రుణాలు పొంది ఆర్థిక అక్షరాస్యత సాధించాలని కోటబొమ్మాళి డిసిసిబి మేనేజర్ ఎన్.ఉషారాణి అన్నారు. కోటబొమ్మాళిలో మహిళా స్వయంశక్తి సంఘాలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలకు అతితక్కువ వడ్డీకు రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రజలకు తమ బ్యాంకు ద్వారా 40 సంఘాలకు రూ.1.20 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. ఒక్కో సంఘానికి గరిష్టంగా రూ. 20 లక్షల రుణం అందిస్తున్నామన్నారు. చిన్న పిల్లల చదువులకు అధిక వడ్డీతో పాటు, ఆర్‌డిలపై అధిక వడ్డీ అందిస్తున్నామని తెలిపారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బాల్య వివాహ రహిత భారతదేశ నిర్మాణాని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో జ్యుడిషియల్ ఆఫీసర్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, డిస్ట్రర్బ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, చైల్డ్‌లైన్, ఎన్‌జిఒలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా అదరపు న్యాయమూర్తులు శ్రీదేవి, ఫణికుమార్, భాస్కరరావు, సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు, మెజిస్ట్రేటు్ల శారదాంబ, శ్రీభరణి శ్రీవిద్య, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రమణ, చైల్డ్ అండ్ ఎన్‌జిఒ సింహాచలం, డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్స్ పెట్ట మల్లేశ్వరరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె ఆఫీస్ డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుట్ట అంజనీకుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పైడి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

పోలాకి: సమాజంలో బాల్యవివాహాలు నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల పరిషత్ ప్రత్యేక సలహారులు ముద్దాడ భైరాగినాయుడు సూచించారు. ఎపిఎం రాజారావు ఆధ్వర్యాన బాల్య వివాహాలు నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. అధికారులు, మండల మహిళా సభ్యులు ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో డిటి పి.శ్రీనివాసరావు, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్‌కుమార్, సిసిలు, అకౌంటెంట్ సత్యవతి, సిఒ నీరజ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక ఐకెపి వెలుగు కార్యాలయం నుంచి మెళియాపుట్టి మూడు రోడ్ల జంక్షన్ వరకు బాల్య వివాహాలను నిర్మిలిద్దామని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎపిఎం లలిత, సిసి వీరన్ననాయుడు, మహిళా సంఘ ప్రతినిధులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వెలుగు ఎపిఎం ప్రసాదరావు ఆధ్వర్యాన బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సంఘాలతో సామూహికంగా ప్రతిజ్ఞలు చేయించారు.

వజ్రపుకొత్తూరు : బాల్య వివాహాలు రహిత పంచాయతీగా దేవునల్తాడను తీర్చిదిద్దాలని వెలుగు ఎపిఎం కె.జాంబవతి అన్నారు. ఈ మేరకు సూర్యమనిపురం మహిళ సంఘాల సభ్యులతో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరద రాజు, సెక్రెటరీ కామరాజు, సిసి ధనలక్ష్మి, విఒఎలు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : స్థానిక కంచ్రవీధిలో ఎపిఎం నారాయణరావు అధ్యక్షతన మహిళా గ్రామ సంఘ సభ్యులు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు విఒఎ మహేశ్వరి, సిసి పద్మ, గ్రామ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.



సోంపేట : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



ఆమదాలవలస: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎపిఎం కూర్మారావు

సోంపేట: బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై పట్టణంలో అంగన్వాడీ, ఆశ కార్యకర్తలతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ స్థాపన ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారని అన్నారు. అందులో భాగంగా ఈ ర్యాలీ చేపట్టినట్లు ఎంపిపి నిమ్మన దాసు తెలిపారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణ, ఎపిఎం రవణమ్మ పాల్గొన్నారు.

ఆమదాలవలస: గ్రామీణ ప్రాంతాల్లో స్వయంశక్తి సంఘాల కుటుంబాల్లో ఆడపిల్లలందరికీ చదువే ముద్దని, బాల్య వివాహాలు వద్దని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు పిలుపునిచ్చారు. మండలంలోని జొన్నవలస పంచాయతీలో గల స్వయంశక్తి సంఘ సభ్యుల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో మహిళలతో ర్యాలీ నిర్వహించి, బాల్యవివాహాల వల్ల వస్తున్న అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలందరినీ చదివిస్తామని, ఎట్టి పరిస్థితుల్లో బాల్య వివాహాలను సమర్థించమని సభ్యులందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు ఉమ, రామప్పడు, విఒఎలు జయలక్ష్మి, రమణమ్మ, గురుమూర్తి, సుజాత, రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం పట్టదా?

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరీష

పలాస: వైసిపి నాయకులు చావులు, ఇతరులపై అసభ్యకర పదజాలంతో మాట్లాడడం తప్ప ప్రజా సంక్షేమం పట్టడం లేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మృతి సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంతకాల సేకరణ చేయించుకుని సిఎం సీటు కోసం పాకులాడిన వ్యక్తిని విమర్శించారు. అధికారం కోసం కుటుంబాలను బలిచేసే వైసిపి పార్టీలో ఉన్న మీకు కుటుంబ బంధాలు గూర్చి మాట్లాడే అర్హత మీకు లేదన్నారు. తండ్రి శవం పక్కన పెట్టి అధికారం కోసం సంతకాలు సేకరిస్తున్న కుటుంబ సభ్యులు మౌనం వహించారన్నారు. ఆ సమయంలో జగన్ తల్లి విజయ లక్ష్మి వారించుంటే తల్లి ప్రాముఖ్యత తెలుసుండేదన్నారు.



గౌతు శిరీష

భర్త ఆరోగ్యాన్ని రాజమండ్రిలో ఉండి యోగక్షేమాలు చూస్తున్నా భువనేశ్వరి గురించి, ఇటు కుటుంబం, అటు రాష్ట్రాన్ని కాపాడడం కోసం తాపత్రయం పడుతున్న లోకేష్ గురించి మాట్లాడే అర్హత మీకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడుపై కేసు అప్రజాస్వామికమని, న్యాయం తెలిసిన ప్రతి వారూ నమ్ముతున్నారని అన్నారు. అందరూ మానసికంగా, సామాజిక మీడియాలో భువనేశ్వరి, అధినేత చంద్రబాబు కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

వ్యాపార అభివృద్ధిలో పలాస ముందంజ

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

సందడి చేసిన సినీ తార మెహ్రీన్

పలాస: జిల్లా కేంద్రం తరువాత పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలు వ్యాపారాభివృద్ధి కేంద్రాలుగా మారుతుందని పశు సంవర్థకశాఖ మంత్రిశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ బిఎస్ఆర్ షాపింగ్‌మాల్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. మున్సిపాలిటీలో తలమానికంగా నిలుస్తున్న షాపింగ్‌మాల్ ప్రజల అవసరాలను తీరుస్తున్నాయని అన్నారు. గతంలో వారికి కావాల్సిన సరుకులు కొనేందుకు శ్రీకాకుళం, విశాఖకు వెళ్లేవారని, ప్రస్తుతం అనేక షాపింగ్‌మాల్స్ పలాస- కాశీబుగ్గ ప్రాంతాల్లో ప్రారంభించడం వ్యాపారాభివృద్ధికి సూచికగా భావిస్తున్నామన్నారు. ముందుగా సినీతార మెహ్రీన్ సందడి చేసింది. ఆమెను చూసేందుకు ప్రజలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పలాస తనకు ఎంతగానో నచ్చిందని, మళ్లీ వస్తానని మెహ్రీన్ అన్నారు. కార్యక్రమంలో షాపింగ్ మాల్ యజమానులు బరాటం నాగభూషణరావు, భానుమతి, బరాటం సతీష్, బరాటం రమేష్, పి.శంకర్, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు, పి.ప్రసాదరావు పాల్గొన్నారు.



షాపింగ్‌మాల్‌లో సినీతార మెహ్రీన్

డ్రైవింగ్ స్కూల్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవర్లకు శిక్షణా తరగతులు సోమవారం శ్రీకాకుళం డిపో-1 మేనేజర్ కె. మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ స్కూల్ ఇప్పటివరకు 13 బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకున్నారని, 14వ బ్యాచ్ శిక్షణ మొదలైందని తెలిపారు. ఆర్‌టిసిలో విలువలతో కూడిన శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించి భవిష్యత్తులో డ్రైవర్లుగా ఉద్యోగ అవకాశాలు పొందుతారన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డిపో-2 మేనేజర్ కెఆర్ఎస్. శర్మ, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ, ఎఎన్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పర్యటిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలో గొప్పిలిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాలు సాధ్యమని అన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ పల్లి జయసుధ, ఎంపిటిసి కొల్లన ఇందిర, తహశీల్దార్ పి.సరోజిని, ఆనందరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పలాస: మండలంలోని మాకన్నపల్లికి చెందిన జానపద కళాకారుడు సాలిన అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు, బొడ్డపాడు జైభీం యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు తన వంతుగా రూ.10 వేలు ఆర్థికసాయం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఢిల్లీరావు

అనస్థీషియా వైద్యం అత్యంత కీలకం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శస్త్రచికిత్సల సమయంలోనే కాకుండా క్యాన్సర్ రోగులకు అందించే చికిత్సలో అనస్థీషియా వైద్యం అత్యంత కీలకమని ఐఎస్ఎ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రముఖ అనస్థీషియన్ శిరీష అన్నారు. ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని రిమ్స్ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజనాసుపత్రి అనస్థీషియా విభాగం, ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్టు ఆధ్వర్యాన వైద్య విద్యార్థులు, అనస్థీషియా నిపుణులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1846 అక్టోబరు 16న మొదటిసారిగా డబ్ల్యుటిజి మోర్టన్ మసాచుసెట్స్ జనరల్ ఆస్పత్రిలో దంతాల వెలికితీతలో ఈథర్ అనస్థీషియాను ఉపయోగించి విజయవంతంగా చికిత్స నిర్వహించారన్నారు. అప్పటి నుండి రోగుల్లో మెరుగైన నొప్పి తెలియకుండా శస్త్రచికిత్స చేయడానికి తోడ్పడిందన్నారు. 2023 థీమ్ అనస్థీషియా, క్యాన్సర్ కేర్, క్యాన్సర్ రోగుల్లో పాలియేటివ్ కేర్‌లో అనస్థీషియాలజిస్టుల పాత్రను ప్రస్తావించారు. బలగలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిపిఆర్ అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్. టిఎస్ఎన్ ప్రకాష్, ప్రొఫెసర్ రిమ్స్ హెడ్, అనస్థీషియాలజీ విభాగం డా. కె. జానకిబాబు, డా. టి. రంగనాథ్, డా. టి.వి.వి.ఎస్.వి. ప్రసాద్, డా. శిరీష, డా. భవాని, డా. వాసుదేవరావు, డా. శాంతి శ్వేత, డా. ఉమా సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



వైద్యులకు మిఠాయిలు తినిపిస్తున్న శ్రీధర్

మెడికవర్ హాస్పిటల్‌లో...

నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఎండి డాక్టర్ దానేటి శ్రీధర్ కేక్ కట్ చేసి అనస్థీషియా వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ భానుచలం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మంచినీటిని అందిస్తాం

స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస నియోజకవర్గంలో ఇంటింటికి మంచినీటిని అందిస్తామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం మండలంలోని తురకపేట గ్రామంలో రూ.37.30 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన మంచినీటి కొళాయిలను ప్రారంభించారు. అనంతరం కట్యాచార్యులపేట పంచాయతీ పరిధిలోని హనుమంతపురం గ్రామంలో రూ.43.37 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తాగునీటిని అందించడమే తన ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, వైసిపి నాయకులు మామిడి ఢిల్లీ, తిర్లంగి రామారావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ, జెఇ చంద్రమౌళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పొందూరు: శంకుస్థాపన చేస్తున్న స్పీకర్

పొందూరు: నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పూర్తిస్థాయిలో తాగునీరు, సాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రాపాక పంచాయతీ ఇల్లయ్యగారిపేటలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాపాక-దల్లవలస రహదారి నుండి ఇల్లయ్యగారిపేట వరకు ఇటీవల రూ.65లక్షలతో నిర్మించిన బిటి రహదారిని ఆయన ప్రారంభించారు. అలాగే జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.54లక్షలతో ఇంటింటా కొళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరలా వైసిపి ప్రభుత్వం విజయం సాధించడం ఖాయమని ఆయన దీమా వ్యక్తం చేశారు. అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ లబ్దిదారులకు అందజేసిన సంక్షేమాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, వండాన సూరపునాయుడు, ఎంపిటిసి-2 ప్రతినిధి కోట నాగరాజు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చినబడాం రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని సోమవారం శుభ్రపరిచారు. ప్రజాశక్తి దినపత్రికలో 'ఇదేనా... స్వచ్ఛత సేవా?' శీర్షికతో కథనాన్ని వెలువడింది. ఈ కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. చినబడాం రోడ్డు పక్కన ఉన్న చెత్తా చెదారాన్ని ప్రొక్లెయినర్‌తో శుభ్రం చేయించారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడికక్కడ చెత్తా చెదారం పేరుకుపోయి ఉంటే తక్షణమే శుభ్రం చేస్తామని మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు.



చెత్తా చెదారం తొలగించిన అధికారులు

పోర్టు వాహనం ఢీకొని

యువకుడు మృతి

టెక్కలి రూరల్ : మూలపేట పోర్టు వాహనం ఢీకొని ఒడిశా రాష్ట్రం రాయపూర్‌కు చెందిన కిల్లి చంద్రశేఖర్ (28) సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చంద్రశేఖర్ టెక్కలిలోని శ్రీరామ కాలనీలో ఉన్న తన బావ బొంగు లోకనాథం ఇంట్లో ఉంటున్నాడు. పట్టణంలో ఎసిలను మరమ్మతులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం పట్టణానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా, మూలపేట పోర్టు నిర్మాణ సామగ్రిని తీసుకెళ్తున్న వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ తల నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న సిఐ సూర్య చంద్రమౌళి ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధమవుతుండగా, మృతుని బంధువులు అడ్డుకున్నారు. పోర్టు యాజమాన్యం మృతదేహం దగ్గరకు రావాలని పట్టుబట్టారు. మృతదేహం తరలించిన తరువాత పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుకుందామని డిఎస్‌పి బాలచంద్రారెడ్డి మృతుని కుటుంబసభ్యులు, బంధువులకు నచ్చజెప్పడంతో వారు అంగీకరించారు.



చంద్రశేఖర్ (ఫైల్)

రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి

విశ్వసముద్ర వాహనం ఢీకొని మృతి చెందిన కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోత మధుసూదనరావు డిమాండ్ చేశారు. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ఓ నిండు ప్రాణం బలికొందన్నారు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు రోడ్డున పడ్డారని అన్నారు. రాత్రి పూటకు వాహనాలకు అనుమతి ఇవ్వాలన్నారు. ప్రతి కూడలిలోనూ పోలీస్ పహారా ఉండాలన్నారు. అతివేగాన్ని నియంత్రించాలన్నారు. 40 టన్నులు బరువు మించి వాహనాలు నడపకూడదన్నారు. మృతుని కుటుంబంలోని ఒకరికి పోర్టులో ఉద్యోగం ఇవ్వాలన్నారు.



అదుపు తప్పి పక్కకు ఒరిగిన ఆర్‌టిసి బస్సు

అదుపు తప్పిన బస్సు

ప్రజాశక్తి - నందిగాం

మండలంలోని తురకలకోట వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఆర్‌టిసి బస్సు బ్రేకులు ఫెయిల్ అయి అదుపు తప్పి రోడ్డు పక్కకు జారుకుంది. పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఈ బస్సులో ఏడుగురు ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం కేసు దర్యాప్తు చేస్తున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రమేష్

క్రీడలతో మానసిక ఉల్లాసం

కవిటి : క్రీడలు మానసిక ఉల్లాసం కలిగించి విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు దోహదపడతాయని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ఉప కార్యదర్శి బల్లెడ రమేష్ అన్నారు. మండలంలోని రాజపురం ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న వాలీబాల్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి శిక్షణ కేంద్రాలను ఉపయోగించుకుని మంచి క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు నేతాజీ పాల్గొన్నారు.

ముగ్గురిపై బైండోవర్ కేసులు

కవిటి: అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించి ముగ్గురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తహశీల్దార్ పి.శేఖర్ తెలిపారు. కవిటి మండలం బల్లిపుట్టుగకు చెందిన నల్లాన రామారావు, ఆర్.బెలగాంకు చెందిన దేవాడ కేశవ రామరాజు, రాజపురానికి చెందిన టెంక మోహన్‌పై ఈ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

యాదవుల అభివృద్ధికి కృషి

వజ్రపుకొత్తూరు : యాదవుల అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని గొర్రెలు, మేకలు పెంపకందార్ల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు రాపాక చిన్నారావు అన్నారు. మండలంలోని గరుడబద్రలో సర్పంచ్ గూడ గిరిజ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదవులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకు బాటులో ఉన్న వారిని ఆదుకుంటామని అన్నారు. గొర్రెలు, మేకలు జీవితాలు దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి రాయితీ రుణాలకు కృషి చేస్తామన్నారు. అనంతరం చిన్నారావును సన్మానించారు. కార్యక్రమంలో గూడ ఈశ్వరరావు, ఉప సర్పంచ్ ఎం.పార్వతి, యువజన సంఘం అధ్యక్షులు వై.సంతోష్‌కుమార్, కె.చినబాబు, జి.నరేష్, వి.ఢిల్లీరావు, ఎం.చందు, కె.ఈశ్వరరావు, కె.విప్లవకుమార్ పాల్గొన్నారు.



నోటీసు ఇస్తున్న పోలీస్

గౌతు శిరీషకు నోటీసులు

పలాస: రాజమండ్రిలో మంగళవారం టిడిపి ఆధ్వర్యాన చేపట్టనున్న బిసి సమావేశానికి వెళ్లకుండా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషకు పోలీసులు నోటీసులను సోమవారం అందజేశారు. పలాస నుంచి బయటకు వెళ్లమని సంతకం చేయించుకున్నారు.

'ఆరోగ్య సురక్ష'ను వినియోగించుకోవాలి

స్పీకర్ తమ్మినేని సీతారాం


మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

సిఎం జగన్మోహన్ రెడ్డి పాలన భారతదేశంలో ఆదర్శమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం అన్నంపేట గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి ప్రభుత్వం అందిస్తున్న పాలనను చూసి భారత దేశంలోని అన్ని రాష్ట్రాలు ముక్కున వేలేసుకున్నాయన్నారు. ఈ సిఎం దేశంలోనే చరిత్ర సృష్టించారని, ఎక్కడా కనీవిని ఎరుగని రీతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. విద్య, వైద్యానికి పేదరికం అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతంలో ఇంటింటికీ వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రజలు సంక్షేమాన్ని అర్థం చేసుకుని నిజాయితీగల పాలన రక్షించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం స్పీకర్‌తో పాటు ప్రజాప్రతినిధులందరూ వైద్య శిబిరాన్ని, అంగన్వాడి టీచర్లు నిర్వహించిన పోషకాహార పదార్థాల ప్రదర్శనను పరిశీలించారు. ప్రముఖ వైద్యులు ప్రియదర్శిని, శ్రీవల్లి రమ్య, పైడి సుజాత వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే కంటి పరీక్షలను ఆప్తాలమిక్ అసిస్టెంట్ ప్రసాదరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, టిటిడి రాష్ట్ర డైరెక్టర్ కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణనాయుడు, మండల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు, ఎంపిటిసి గుమ్మడి రాంబాబు, సర్పంచ్ ఇప్పిలి అంబజాక్షి పిఎసిఎస్ అధ్యక్షుడు బాగాది నారాయణమూర్తి, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ ఎస్. రమణారావు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సూరపు ఉదయ్, వైసిపి నాయకులు కొరికాన శంకరరావు, మామిడి ఆదినారాయణ, మామిడి శ్రీరాములు, కిరణ్ కుమార్, మామిడి శ్రీనివాసరావు, సురేష్ దొర, ఇప్పిలి అప్పలనాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని మంచినీళ్లపేటలో నిర్వహించి జనగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వంక రాజు, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఇఒపిఆర్‌డి దిక్కల తిరుమలరావు, అంగన్వాడీ కార్యకర్త గీత, వజ్రపుకొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విజయకుమార్‌రెడ్డి, జెమ్స్ వైద్యులు వేదాంతరెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని కొత్తరేవు సచివాలయం పరిధిలో నిర్వహించిన జగన్న ఆరోగ్య సురక్షలో డిసిసిబి ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు పాల్గొన్నారు. వైద్యులు శ్రీనాథ్, రత్నంరాజు ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, ఎంపిడిఒ ఉషశ్రీ, డిటి పి.శ్రీనివాసరావు, విస్తరణ అధికారి ఎన్.రవికుమార్, ఎంపిహెచ్ఒ బి.రామకృష్ణ పాల్గొన్నారు.


పోలాకి : మాట్లాడుతున్న రాజేశ్వరరావు

కొత్తూరు : స్థానిక ప్రాథమిక పాఠశాల-1లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు రక్త పరీక్షలు చేశారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ యు.విమలకుమారి ఆధ్వర్యాన పౌష్టికాహారం ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఇందులో మునగ ఆకుతో తయారు చేసిన పిండి వంటలను చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లింగాల శాంతికుమారి, వైద్యులు రాంబాబు, రామకృష్ణ, తేజస్వి, యోగిత, రాజు, సతీష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని హరిశ్చంద్రపురంలో నిర్వహించిన జగన్న ఆరోగ్య సురక్షలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు పాల్గొన్నారు. వైద్యులు 401 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, డిటి ఆర్.మధు, సర్పంచ్ జి.కేశవ రావు, ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పలాస: మండలంలోని లక్ష్మీపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో 74 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

పాల పోలమ్మతల్లి ఆలయంలో
ఆలీబాబా 40 దొంగలు పడ్డారు
టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్


మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో పాలపోలమ్మ తల్లి గుడిలో ఆలీబాబా 40 దొంగలు పడ్డారని, భక్తులందరూ అప్రమత్తంగా ఉండాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం పట్టణంలో పాలపోలమ్మ తల్లి కిరీటం పేరిట శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చేసిన ఊరేగింపు కార్యక్రమాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కలింగవైశ్యులు మరికొంత మంది ఆధ్వర్యంలో యాత్రికుల సహకారంతో ఆలయం అభివృద్ధి చెందిందన్నారు. శిల్లా రంగ సత్యనారాయణ, కుసుమంచి శ్యాంప్రసాదరావు, కూన అప్పలనాయుడు మరి కొంతమంది పెద్దలు ఆలయానికి కాపలాదారులుగా వ్యవహరించిన వ్యక్తులను పక్కన పెట్టి నేడు ఆలీబాబా 40 మంది దొంగలు ఆలయంలోనికి ప్రవేశించి దేవుడు సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యాత్రికులు సమర్పించిన 530 గ్రాముల బంగారాన్ని ఆలయంలోనే ఉన్న లాకర్‌ను పగలగొట్టి దోపిడీ దొంగలులా దోచుకెల్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 24 క్యారెట్ల 530 గ్రాములు బంగారాన్ని 22 క్యారెట్లలోకి మార్చి అమ్మవారికి కిరీటం చేయించి పట్టణంలో ఊరేగించి సీతారాం సొంత డబ్బులతో చేయించినట్లు అసత్యాలు పత్రికలోను, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈయనతో పాటు మున్సిపల్ మాజీ ఛైర్మన్ కూన అప్పలనాయుడు పాల్గొన్నారు.

కథలు చెప్పడం నేర్చుకోవాలి


రణస్థలం : కథలు చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- లావేరు

ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులు కథలు చెప్పడం నేర్చుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. సోమవారం లావేరు శాఖా గ్రంథాలయములో దసరా సెలవులు సందర్భంగా విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి కథలు చెప్పారు. వీరికి గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు దసరా శిక్షణా శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పాఠశాల విద్యార్థులకు దసరా సెలవులు సందర్భంగా శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. చదవడం, రాయడం, వినడం, కథలు, కథనాలు వంటివి నేర్పిస్తామని తెలిపారు. శిక్షణా తరగతుల్లో భాగంగా ముందుగా విద్యార్థులతో దినపత్రికల పఠనం, కథలను చదివించడం, దేశ నాయకుల జీవిత చరిత్రను మరియు వాళ్లకు నచ్చిన చిత్రలేఖనం వేయడం చేపట్టారు. ఈ కార్యక్రమానికి హిందీ ఉపాధ్యాయులు టి.సత్యం, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి : విద్యార్థుల్లో చిన్నతనం నుంచే నైతిక విలువలు పెరగాల్సిన అవసరం ఉందని టెక్కలి శాఖాగ్రంథాలయాధికారి బి.రూపవతి అన్నారు. దసరా శిబిరంలో భాగంగా విద్యార్థులచే నీతి కథలు చదివించారు. కార్యక్రమంలో సహాయకురాలు అమ్మనమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై యుద్ధం తప్పదు

బూర్జ: అరాచక ప్రభుత్వంపై ప్రతి ఒక్కరూ యుద్ధం చేయక తప్పదని మాజీ ప్రభుత్వ విప్ కూన రవికుమార్ అన్నారు. తోటవాడలో బాబుతో నేను కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపులు, అరెస్టులతో ఐక్య రాజకీయాలు మారాయని, ఓటుహక్కు ఉన్న ప్రతి పౌరుడు ప్రభుత్వంపై యుద్ధం చేయక తప్పదని ఆయన పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి ఎ. రామకష్ణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సీతారాంబాబు నాయుడు, మాజీ వైస్ ఎంపిపి పీరుకట్ల ప్రభాకరరావు, మాజీ సర్పంచ్ గేదెలు ప్రసాదరావు, మజ్జి శ్రీరాములు నాయుడు, లంక జగన్నాథంనాయుడు, గణపతిరావు, వెంకట సీతారామరాజు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ప్రదర్శిస్తున్న టిడిపి నాయకులు

న్యాయవాదుల సంక్షేమంపై రాజీ వద్దు


మాట్లాడుతున్న సూర్యారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

న్యాయవాదుల సంక్షేమం విషయంలో రాజీ లేని పోరాటం చేయాలని పలువురు న్యాయవాదులు పిలుపునిచ్చారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు ఆధ్వర్యాన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంక్షేమ నిధి స్టాంపు రుసుం పెంపును వ్యతిరేకించారు. ప్రస్తుతం న్యాయవాదులకు ఆపద సమయంలో చెల్లిస్తున్న రూ.నాలుగు లక్షలను కనీసం రూ.20 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తాన్ని పెంచకుండా ఒక్క సంక్షేమ నిధి స్టాంపు రుసుము పెంపు సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించి చేస్తున్న ఉద్యమానికి రాష్ట్ర బార్ కౌన్సిల్ ఒక మెట్టు దిగి వచ్చి అన్ని బార్ అసోసియేషన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో ఈనెల 21న సమావేశం నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. సంక్షేమ నిధి స్టాంపు రుసుము పెంపుతో పాటు న్యాయవాదులకు ఇస్తున్న ఆపత్కాల పరిహారాన్ని పెంచాలని కోరారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు ఎన్.విజయ్‌కుమార్, జల్లు తిరుపతిరావు, పొన్నాడ వెంకటరమణారావు, ఆంధ్రప్రదేశ్ బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు శిష్టు రమేష్, బార్ అసోసియేషన్ కార్యదర్శి, పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు గొంటి చంద్ర మౌళి, మహిళా ప్రతినిధి వి.హరిప్రియ పాల్గొన్నారు.

భూహక్కు-భూ రక్షపై అవగాహన



సంతబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నౌపడ: సంతబొమ్మాళి మండలం చిన్న తుంగాం సర్పంచ్ సిమ్మ గోవిందరావు ఆధ్వర్యాన జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్షపై అవగాహన కల్పించారు. ఈ మేరకు గ్రామకంఠం పరిధిలోని గృహాలకు రికార్డ్స్ ఆఫ్ రైట్స్ కింద పూర్తి హక్కులు కల్పిస్తూ పత్రాలు జారీ చేసేందుకు ప్రజలను చైతన్య పరుస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనివాసరావు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని కంబల రాయుడుపేట, అమలపాడు, అక్కుపల్లి పంచాయతీల్లో ఇఒపిఆర్‌డి డి.తిరుపతిరావు జగనన్న శాశ్వత భూ హక్కు - భూరక్ష పథకంపై సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గ్రామకంఠం రికార్డ్ ఆఫ్ రైట్స్‌పై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వంక చిరంజీవి, ఎంపిటిసి కారి వెంకటరావు, పంచాయతీ అధికారి పి.ఆనంద్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని గోవిందపురం పంచాయతీలో సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి ఆధ్వర్యాన జగనన్న భూ హక్కు-భూ రక్షపై అవగాహన కల్పించారు. గ్రామకంఠం పరిధిలోని గృహాలకు రికార్డ్స్ అఫ్ రైట్స్ కింది పూర్తి హక్కులు కల్పిస్తూ హక్కు పత్రాలు జారీ చేసేందుకు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ రెయ్యిప్రసాద్‌రెడ్డి, సచివాలయం కార్యదర్శి ఎస్.ఢిల్లేశ్వరారావు పాల్గొన్నారు.

కవిటి : మండలంలో దుగానపుట్టుగలో జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్షణ పథకంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎస్.పి.నారాయణ స్వామి, దుగాన భద్రాచలం, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, కార్యదర్శి చిన్నారి, సచివాలయం సిబ్బంది లోళ్ల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా బాణాల పండగ


బాణం విల్లును వదులుతున్న విద్యార్థులు

పొందూరు: బెజ్జిపురం యూత్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇండియా లిటరెసీ ప్రాజెక్టు బెంగుళూరు వారి సహకారంతో పట్టణంలోని అంగన్వాడీ కేంద్రం-1, 9లో దసరా పండగ ఉత్సవాల్లో భాగంగా బాణాల పండగను నిర్వహించారు. సందర్భంగా కమ్యూనిటీ ఆర్గనైజర్ కాళ్ల శ్రావణి ఆనాటి ఆచార సంప్రదాయాలను, దసరా పండగ ఆవశ్యకతను చిన్నారులకు వివరించారు. పాటను పాడుతూ వీధుల్లో బాణాలు పట్టుకొని తిరిగారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ డి.రమాదేవి, అంగన్వాడీ కార్యకర్త డి.లక్ష్మి, అంగన్వాడీ సహాయకులు తవుడమ్మ, రమణమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుంజా సత్యవతి మృతిపై సంతాపం



ఆమదాలవలస: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భద్రాచలం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా పనిచేసిన కుంజా సత్యవతి మృతి చెందడం పట్ల రాష్ట్ర పిసిసి ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను 2012-13 మధ్యలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిటీ ఛైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఆమె కమిటీలో సభ్యురాలు గా పని చేసారన్నారు. పార్టీ పట్ల విధేయతతోపనిచేసేవారని గుర్తు చేశారు.

ప్రజా వైద్యుడు మృతి


నాయుడు (ఫైల్)

టెక్కలి రూరల్ : మేజర్ పంచాయతీ కొండ్రవీధిలో నివాసముంటున్న వైద్యుడు ఎన్.వి.నాయుడు(77) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయన పేదలకు పెన్నిధిగా ఇప్పటికీ రూ.50 మాత్రమ ఫీజు తీసుకొని వైద్యం చేశారు. నాయుడు మృతిని టెక్కలి ప్రజానీకం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈయన క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ప్రజా కళా సమితి అధ్యక్షులుగా పనిచేవారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ... ప్రజాసేవలో ముందు వరుసలో ఉండేవారు. ప్రజా ప్రతినిధులు, వైద్యులు సంతాపం తెలిపారు.


ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సిఐ సూర్యచంద్రమౌళి

జాతర ఏర్పాట్లు పరిశీలన

కోటబొమ్మాళి : మండల కేంద్రంలో మంగళవారం నుంచి జరుగునున్న కొత్తమ్మతల్లి ఉత్సవాల ఏర్పాట్లను టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దర్శనానికి వచ్చే యాత్రికులు, విఐపిలు, అధికారుల వాహనాల పార్కింగ్ స్థలం, మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, కొత్తమ్మతల్లి ఆలమానికి వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సర్పంచ్ కాళ్ల సంజీవరావు, ఆలయ మేనేజర్ వాకచార్ల రాధాకృష్ణలను సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యూలైన్లు ఏర్పాట్లు, యాత్రికులకు తాగునీటి సౌకర్యం, టిక్కెట్లు కౌంటర్ల గురించి శ్రద్ధ వహించాలన్నారు. యాత్రికులకు ఉచిత అన్నదాన ఏర్పాట్లు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు ఎస్ఐ షేక్‌మహ్మద్‌అలీ, వైసిపి నాయకులు డి.సింహాచలం, ఇర్రి చిరంజీవి ఉన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

రణస్థలం రూరల్: ఎస్ఎస్ఆర్-2024 ప్రకారం ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక తహశీల్దార్ కార్యాల యంలో సమావేశం ఏర్పాటు చేయ డమైందని ఎలక్షన్ డిటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.


మాట్లాడుతున్న అన్వేష్

క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి

ఇచ్ఛాపురం : జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి చేస్తామని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ అన్నారు. పట్టణంలోని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు అందుబాటులో తీసుకొస్తామని అన్నారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి కావాల్సిన సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జాన్ డేవిడ్, జాయింట్ సెక్రటరీ జాన్ కుమార్, దాసరి చిన్నారావు, జి.ఫెలో మేను, రౌతు దేవికి రాణి, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఉత్తమ సేవలు అందించాలి

వజ్రపుకొత్తూరు : గ్రామ వాలంటీర్లు ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లకు సోమవారం నియామక పత్రాలను అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, దుక్క లోకేశ్వరరెడ్డి, ఆశి పురుషోత్తంరెడ్డి, పి.రాజశేఖర్ రెడ్డి, నీలాపు సారథి, దక్కత నూకయ్య, ఉప్పాడ రాజారెడ్డి, తిప్పన నాగరాజు, రాంపత్ని చిట్టిబాబు, బాకీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.